# గోసాయి చిట్కా

కొలేజీ వార్షికోత్సవాలలో భాగంగా వక్తృత్వపు పోటీలుకూడా జరపడం రివాజు. దేశాన్ని ఉద్ధరింతా మనుకునే విద్యార్థులు, నలుగురిలో ధైర్యంగా నిలపడి గడగడ మాట్లాడడం నేర్చుకోడానికి ఇది గొప్ప ఛాన్సు. సీతారామారావుకి దేశాన్ని ఉద్ధరింతా మనే కోరికలైతే లేవుగాని, ఆనాటి వక్తృత్వపు పోటీలలో మొదటి బహుమతి మట్టుకు ఎలాగైనా కొట్టేయాలనే కోరిక చాలా బలంగా కలిగింది. సీతారామరావు విద్యార్థి దశలోనే కథలైతే రాశాడు. కవిత్వమూ రాశాడు! చాలావరకు అచ్చయినై కూడా. అతను రాసిన కథలు ఒకటి రెండు తిరిగొచ్చినా, కవిత్వానికి మటుకు ఆ భాగ్యం పట్టలేదు. పజ్యాలూ, వచన గేయాలూ, స్వేచ్ఛాకవితా అన్నీ విధిగా అచ్చయిపోయేవి.

బహుమతినిర్ణేతలలో ఒకానొక మాసపత్రిక సంపాదకుడున్నట్టు సీతారామారావుకి ముందే తెలిసిపోయింది. ఆ సంపాదకుణ్ణి, ఈ పనికోసం, కాలేజీ వాళ్ళు ప్రత్యేకం రైలు ఖర్చు లిప్పించి రప్పించారు. ఆ సంపాదకుడు చాలామంది సంపాదకుల్లాగా కేవలం సంపాదకుడేకాడు, అతను కవిత్వమూ కథలూ గట్రా సొంతాన రాయగలిగే సంపాదకుడు! కాబట్టి ఆ సంపాదకుడికి కవిత్వమంటే ఏమిటో. కథలంటే ఏమిటో బాగా తెలుసునని అభిజ్ఞుల అభిప్రాయంగా ఉంటున్నది. సీతారామారావు రాసిన కొన్ని గేయాలూ అవీ, ఈ సంపాదకుడు తన పత్రికలో వేసినవాడే. కాని ఆయా గేయసంపద సృష్టికర్త సీతారామారావు అన్న సంగతి సంపాదకుల వారికి తెలీదు. ఎందుకంటే, గేయాలకు మట్టుకు. సీతారామారావు 'సీతాదేవి' అనే పేరుతో పంపడం అలవాటు చేసుకున్నాడు.

వక్తృత్వపు పోటీసాగుతున్నది. సీతారామారావు వేదిక మీది కెక్కాడు. "విద్యార్థులు వెర్రితలలు వేయటానికి ఈనాటి సినిమాలు కారణమవునా, కాదా?" అనేది మాట్లాడవలసిన విషయంగా నిర్ణయించారు. సీతారామారావు కొన్నాళ్ళ కిందట సినీతారలందరి పేర్లూ ఉపయోగించుకుని బ్రహ్మాండమైన పొడుగాటి గేయం రాసిఉన్నాడు. బహుమతి నిర్ణేతగా ఉన్న సంపాదకుడి పత్రికలోనే అది ప్రచురణ భాగ్యం పొందింది. 'సీతాదేవి' పేరుతో. ఆ గేయం ఇప్పుడు సీతారామారావుకి బాగా పనికొచ్చింది. మాట్లాడవలసిన అంశంమీద నోరు ఎటుతిరిగితే అటుగా తిప్పి రెండు మూడు ముక్క లేవో పలికాక, గడగడా తన గేయాన్ని 'రిసైట్' చేయటానికి లంకించుకున్నాడు. గేయం పత్రికలోపడి కొంతకాలం గడవడం మూలాన, దాన్ని చదివిన వా రెవరైనా ఉంటే, వారి కది జ్ఞాపకముండిచావలేదు. అంతా కొత్తగానేవుంది అందరికీ. గేయం పూర్తయ్యాక. సీతారామారావు తలకాయలో మెరపులా ఒక మెరుపు మెరిసింది – బహుమతి కొట్టేయటానికి పనికొచ్చే మెరుపులాంటి దది –

"బహుమతి నిర్ణేతలయిన సంపాదక కవిగారి గేయాన్ని సందర్భోచితంగా. ఇట్లా అందరికీ వినిపించే మహాభాగ్యం నాకు కలిగినందుకు అందరికీ కృతజ్ఞత విన్నవిస్తున్నాను," అంటూ సీతారామారావు చక్కా వేదిక దిగిపోయాడు.

అందరితోపాటు, సంపాదకుడుకూడా చప్పట్లు కొట్టకుండా ఉండలేకపోయాడు.

సీతారామారావుని, అత్యుత్తమ వక్తగా నిర్ణయించారు. సీతారామారావుకి మొదటి బహుమతివచ్చిందని వేరే చెప్పాలా?

బహుమతి ప్రదానం ముగిశాక అనుకున్నట్టే, సంపాదకుడుగారు, సీతారామారావుని ఒకసారి ప్రత్యక్షంగా కలియకుండా ఉండలేకపోయినారు.

"ఎంత గొప్పగా మాట్లాడావు! నీలో నాయకుడి లక్షణాలు కొట్టొచ్చేట్టు కనిపిస్తున్నై!" అన్నాడుసంపాదకుడు.

"అంతా మీ చలవ!" అన్నాడు సీతారామారావు.

"ఇంతకీ ఆ గేయం నేను రాసిందేనంటావా? బోల్డు రాశాను, ఏం రాశానో నాకే జ్ఞాపకముండిచావదులే,"

"ఎవరురాస్తే నేమండీ? అచ్చంగా తమరు రాసిన గేయాలలాంటిదే, అది! అందులో మీ ప్రత్యేకత లేదంటారా? అందుకే మీదే అయివుంటుందని మీరు రాసిందే అన్నాను .సందేహమేమిటి? మీరే రాశారు. బాగా జ్ఞాపకం తెచ్చుకోండి."

"ఏమోలే, ఈ మధ్య జ్ఞాపకశక్తి బొత్తిగా చప్పబడిపోతున్నది. నీకు కంఠతా వొచ్చునులాగుందే, రాసిస్తావూ? త్వరలో మరో గేయాలసంపుటి వేస్తున్నాను. అందులో పడేస్తాను దాన్ని – నా దగ్గర కటింగుకూడా ఉన్నట్టులేదు మరి,"

"అయ్యో అదెంత భాగ్యమండీ! రాసుకుంటారా రాసిమ్మంటారా?" అంటూ సీతారామరావు మళ్ళీ ఆ గేయం గడగడ వల్లించగా సంపాదకులుగారు తన జేబులోని చిన్న నోటుపుస్తకంలో రాసేసుకున్నారు.

కొన్నాళ్లు పోయాక, సంపాదక కవిగారి కొత్తగేయాల సంపుటి అతను ప్రేమపూర్వకంగా పంపిన ప్రతిలో తన గేయమే మొదట ఉండటం చూసిన సీతారామారావుకి ఓ పట్టాన నవ్వాగలేదు. సంపాదకుడికి వెంటనే ఉత్తరంరాసి పోస్టుచేశాడు.

"కొన్నాళ్లకిందట సినీతారల పేర్లతో నే నొక పెద్ద గేయం రాసి పంపితే మీ పత్రికలో వేశారు. ఇప్పుడు అదే గేయాన్ని మీరే రాసినట్టుగా మీ సొంతగేయాల సంపుటిలో వేసేసుకున్నారు. ఇందులో ఇమిడి ఉన్న మీ అభిప్రాయం ఏమిటో నాకు అర్థం కాలేదు, అచ్చయిన మీ గేయసంపుటిలోంచి ఆ గేయం తొలగించి నాకు తగిన పరిహారం చెల్లించని పక్షంలో మీ మీద కోర్టులో కేసుపెట్టగల్ను. పదిహేనురోజులలోగా నాకు సమాధానం రాకపోతే, కోర్టులోనే కలుద్దాం – సీతాదేవి."

"చైతన్య"